

పాకాల అగ్రికల్చర్ ఏఓను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పాకాల మండలంలో ప్రభుత్వం ఇస్తున్న వేరుశనగ సబ్సిడీ విత్తనాలు మధ్యాహ్నానికి అయిపోయాయని గడియ పెట్టడం శోచనీయమని, ఏఓను సస్పెండ్ చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.హేమలత మండిపడ్డారు. రైతులు విత్తనాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తుంటే విత్తనాలన్నీ ఒక్క పూటలోనే ఎవరికి ఇచ్చారో జాబితా బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. లేకపోతే అధికార పార్టీ ఇళ్లకు వెళ్లాయనే అనుమానం వస్తుందన్నారు. చిన్నసన్న కారు రైతులకు విత్తనాల పంపిణీ చేయకపోతే పొలాల్లో ఎలా వేరుశనగ సాగు చేయగలరన్నారు. మండలంలోని రైతులకు సరిపడా విత్తనాలు ఇవ్వకపోయినా, కనీసం అరకొర విత్తనాలైనా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. విత్తనాలు ఎవరికి పంపిణీ చేశారో నోటీసు బోర్డులో జాబితా అతికించాలని కోరారు.

తొలిరోజు స్కూళ్లల్లో సందడి

- జులై 5న 'తల్లికి వందనం'
- సచివాలయాలకు జాబితా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సెలవులకు బాయ్‌బాయ్ చెప్పి విద్యార్థులు 'బడిబాట' పట్టారు.. తొలిరోజు స్కూళ్లన్నీ సందడి సందడిగా కనిపించాయి. విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేయడంలో టీచర్లు తలమునకలై కనిపించారు. అయితే స్కూలు హాజరు తక్కువగానే కొన్నిచోట్ల నమోదయ్యింది. 16వ తేదీ నుంచి పూర్తిస్థాయి తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా 'తల్లికి వందనం' జులై 5కు మారింది. ఏడాది పాలన సంబరాల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 'తల్లికి వందనం' జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాను ఆయా సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచనున్నారు. లబ్ధిదారులు నోటీసు బోర్డుల్లో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాల్సి ఉంది. అర్హులైన వారి పేర్లు లేకపోతే సంబంధిత కమిటీ దృష్టికి తీసుకెళితే విచారించి జాబితాలో పొందుపరచనున్నారు. పూర్తిస్థాయి అర్హుల జాబితాను త్వరలోనే నిర్ధారించి, జులై 5న 'తల్లికి వందనం'ను తల్లుల ఖాతాలో జమచేయనున్నారు.


బిఎన్ కండ్రిగ మండలం కల్లివెట్టు స్కూల్లో పుస్తకాల పంపిణీ

ఒక్కొక్కరికి 15వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, రెండువేలు పట్టుకుని 13వేలు మాత్రమే వైసిపి హయాంలో వలెనే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. జీవో నంబర్ 26 ప్రకారం తల్లికి వందనం కింద 15వేల ఆర్థిక సాయాన్ని 1 నుంచి 12 తరగతుల వరకూ విద్యార్థులకు అందించనున్నారు. రెండువేలు పాఠశాల నిర్వహణకు మినహాయించుకుంటున్నారు. 2025-26కు 75శాతం హాజరు ఉన్న వారిని అర్హులుగా గుర్తించారు. కుటుంబంలో వైట్‌రేషన్ కార్డు ఉండాలి. ఎంతమంది పిల్లలు ఉన్నా అర్హులుగా లెక్కించనున్నారు.

సర్వేపల్లి రాధాక్రిష్ణ 'విద్యార్థి మిత్ర' కిట్లు పంపిణీ

జిల్లాలో ఇప్పటివరకూ నోట్‌బుక్స్ 8,12,148 సప్లై చేశారు. బ్యాగులు లక్షా 43వేల 330 ఇచ్చారు. యూనిఫాం లక్షా 43వేల 330 మందికి ఇవ్వాల్సి ఉంది. 96,448 మందికి ఇచ్చారు. 46,842 మందికి ఇవ్వాల్సి ఉంది. షూలు లక్షా 45వేల 464 మందికి ఇవ్వాల్సి ఉండగా 65,595 మందికి ఇచ్చారు. బ్యాలెన్స్ 79,869 మందికి ఇవ్వాల్సి ఉంది. బెల్టు లక్షా 3వేల 382 మందికి ఇచ్చారు. డిక్షనరీలు 12,550 ఇచ్చారు.

గంగ కాలవలో ట్రిపుల్ ఐటి విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని చిన్న సింగమాల వద్ద ఉన్న తెలుగుగంగ కాలనీలో దిగి ఓ ట్రిపుల్ ఐటీ విద్యార్థి గల్లంతైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. టూ టౌన్ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి రూరల్ మండలం చుక్కలనిడిగల్లు గ్రామానికి చెందిన పెరిమిడి మురళి, ప్రశాంత్, ధనుష్ లు స్నేహితులు. వీరిలో మురళి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మొదటి సంవత్సరం పూర్తి చేసి వేసవి సెలవులకు స్వగ్రామం వచ్చాడు. ఈ క్రమంలో ఈత సరదా తీర్చుకునేందుకు స్నేహితులు ప్రశాంత్, ధనుష్ లతో కలిసి గురువారం చిన్న సింగమాల వద్ద ఉన్న తెలుగంగ కాలువ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఈత కొట్టేందుకు ముగ్గురు ఉపక్రమించగా నీటి ఉధతికి కొంత దూరం కొట్టుకుపోయారు. వీరిలో ప్రశాంత్, ధనుష్ లకు ఈత రావడంతో ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నారు. ఈతరాని మురళి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఒడ్డుకు చేరుకున్న ప్రశాంత్, ధనుష్ లు స్నేహితుని కాపాడాలంటూ కేకలు వేసినా లాభం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న మురళి బంధువులు తెలుగు గంగ కాలువ వెంబడి గాలింపు చర్యలు చేపడుతున్నారు. టూ టౌన్ పోలీసులు కూడా గ్రామస్తులతో కలిసి గాలింపుచర్యలో పాల్గొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.







కాంట్రాక్టు కార్మికుల ధర్నా ఉద్దేశించి మాట్లాడుతున్న జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి

స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్విమ్స్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, రెండున్నర సంవత్సరాలుగా అనేకమార్లు అధికారులకు విన్నవించినా, ధర్నాలు చేసినా సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈనెల నాలుగో తేదీ స్విమ్స్ డైరెక్టర్‌కు, టిటిడి ఛైర్మన్, ఈవోలకు, రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక శాఖకు, కలెక్టర్‌కు సమ్మె నోటీసు పంపినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. సమ్మె నోటీసు పంపి ఎనిమిది రోజులు అవుతున్నా యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో స్విమ్స్ ఎమర్జెన్సీ వార్డు ముందు ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్మికులు గురువారం పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.మాధవ్, హాకర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.బుజ్జి పాల్గొన్నారు. శానిటేషన్ పేరు మార్పు చేసి, గతంలో వలే వార్డు బాయిలుగా పరిగణించాలని రెండున్నరేళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నామన్నారు. అధికారులు చేసిన పొరబాటుకు ఏళ్ల తరబడి తక్కువ వేతనాలకు పని చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే 18వ తేదీ నుంచి సమ్మెబాట పడతామని హెచ్చరించారు. అధికారులు బెదిరింపులు మాని సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రవి, సూరి, వెంకటేష్, గోపి, బాష, వేలు, కుమారి, జయమ్మ పాల్గొన్నారు.

చెర్లోపల్లి ఎంపియుపి పాఠశాలను పక్కగ్రామానికి మార్చొద్దు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

చెర్లోపల్లిలో ఉన్న ఎంపియుపి పాఠశాలను పక్క గ్రామానికి మార్చొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. పుత్తూరు ఎంఇఒ కార్యాలయం వద్ద ఈ మేరకు నిరసన చేపట్టారు. 30 మంది పిల్లలు 1-5 తరగతి వరకు చదువుతున్నారని, అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరా సరిపోయినంత మంది విద్యార్థులు ఉన్నారన్నారు. తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు,



తాగునీటి వసతితో పాటు ఉపాధ్యాయులు సరిపడా ఉన్నారన్నారు. ఇలాంటి పాఠశాలను 'డి ప్రమోట్' చేస్తూ వేరే స్కూలుకు తమ పిల్లలను పంపాలంటే పంపించలేమన్నారు. విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే రెండుమూడుసార్లు తమ గ్రామం తరపున వినతిపత్రాలు సమర్పించామన్నారు. స్థానిక ప్రైవేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కయ్యి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని వాపోయారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంగి ఆనంద్, మునిరామయ్య, సుబ్బరామయ్య, మునిరత్నం, హరి, రమేష్, ముత్యాలయ్య, వసంత, గాయత్రి పాల్గొన్నారు.

ముగిసిన 'ఏపిపిజిసెట్' పరీక్ష

ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పక్షాన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏపిపిజిసెట్-2025 పరీక్షలు 9వ తేదీ నుంచి 12 వరకు నిర్విఘ్నంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కన్వీనర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో పకడ్బందీగా, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, రోజుకు మూడు సెషన్స్ లెక్కన మొత్తం 10 సెషన్స్ లో 31 సబ్జెక్టులకు ఎంట్రన్స్ జరిగాయన్నారు. 14 కేంద్రాల్లో (హైదరాబాద్ సహా) పరీక్షలు జరిగాయని, 25,688 మంది విద్యార్థులు పిజి ఎంట్రన్స్ కు దరఖాస్తు చేసుకున్నారని, 22 వేలమంది విద్యార్థులు 86 శాతం పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన వివిధ సబ్జెక్టుల కీ విడుదల చేస్తున్నామని, విద్యార్థులు కీ పరిశీలించి తమ అభ్యంతరాలను వెబ్‌సైట్‌లో తెలియజేయాలన్నారు. ఫైనల్ కీ సిద్ధం చేసి ఈ నెల 25వ తేదీ ఫలితాలు విడుదల చేస్తున్నామని వివరించారు. పిజి సెట్ టీం సభ్యులుగా నిరంతరం కష్టపడిన కామేశ్, నాగభూషణం, సుకుమార్, సునీల్, వీరభద్ర, వీరనాచారి, కో కన్వీనర్ ఆచార్య సురేంద్ర బాబులను అభినందించారు.

నేడు శ్రీకాళహస్తిలో వైఎస్ షర్మిల పర్యటన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జిల్లాల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తికి రానున్నారు. ఆ పర్యటన వివరాలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు దొడ్డా రెడ్డి రాంభూపాల్ రెడ్డి మీడియాకు వివరించారు. పట్టణంలో ర్యాలీ అనంతరం స్థానిక ఆర్జిఆర్ కళ్యాణ మండపంలో షర్మిల సభ ఉంటుందని చెప్పారు. పార్టీని సంస్థాగతంగా అభివద్ధి చేయుటపై జిల్లాస్థాయి విస్తత సమావేశంలో షర్మిల దిశా నిర్దేశం చేయనున్నారు.

2029లో కాంగ్రెస్‌దే అధికారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు 2029లో కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కాంగ్రెస్ శ్రేణులు అందరూ శక్తి వంచన లేకుండా కషి చేయాలని తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఈద సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆమోదంతో 25 మందితో తిరుపతి సిటీ కాంగ్రెస్ నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్కు రాజ్యాంగం అమలవుతోందని, ప్రజలు మంచి పాలన అందించాలని అధికారాన్ని కట్టబెడితే కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో పాలన చేస్తోందన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తిలో తిరుపతి జిల్లాకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షర్మిల రెడ్డి హాజరవుతున్నారన్నారు. తిరుపతి సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు, ఏపీ సి సి ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, నెల్లూరు జిల్లా ఇన్చార్జి మాంగాటి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా 'కూటమి' సంబరాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా తిరుపతి జిల్లావ్యాప్తంగా సంబరాలు జరుపుకుంది. కూటమి శ్రేణులు కేకులు కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. కొన్నిచోట్ల అన్నదానాలు చేశారు. ఎపి బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ ఛైర్మన్ మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కూడలి టౌన్‌క్లబ్ వద్ద కేక్ కట్‌చేసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గురువారం తల్లికి వందనం కింద ప్రతి పిల్లవానికి 15వేల చొప్పున జగచేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే సామాజిక పింఛన్లు, తల్లికి వందనం, మూడు సిలిండర్లు, త్వరలోనే అన్నదాత సుఖీభవ అందించనున్నట్లు తెలిపారు. ఏడాదిలో దాదాపు 80 శాతం హామీలు పూర్తి చేశామన్నారు. నాయకులు శ్రీధర్‌వర్మ, చినబాబు, ఆర్‌సి మునికృష్ణ, పుష్పవతి యాదవ్ పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయం ఎదుట...

తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదుట టిడిపి తిరుమల అధ్యక్షులు రాజుయాదవ్ ఆధ్వర్యంలో 501 కొబ్బరికాయలు కొట్టారు. రెండున్నర కేజీల కర్పూరం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ కె.శివషణ్ముగం పాల్గొన్నారు.

- నాగలాపురంలో... టిడిపి అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. సాయిబాబా ఆలయంనుంచి పిచ్చాటూరు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి ఎంకెటి కల్యాణ మండపంలో మొదటి విజయోత్సవ సభలో పాల్గొన్నారు. సెల్వకుమార్, పార్థిబన్, మాజీ ఎంపిపి మురళి పాల్గొన్నారు.

- గూడూరులో.. ఆర్టీసీ బస్టాండ్ వద్ద టవర్‌క్లాక్ సెంటర్‌లో డీజీ తీన్మార్‌కు మహిళలు డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. ఎంఎల్‌ఎ పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. గూడూరును నెల్లూరులో కలుపుతామన్న తమ ఆకాంక్షను ముఖ్యమంత్రి తప్పక నెరవేరుస్తానని హామీ ఇచ్చారన్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నానాజీ, భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, మట్టం శ్రావణి రెడ్డి పాల్గొన్నారు.

- పిచ్చాటూరులో.. ఎంకెటి మహల్‌లో తొలి ఏడాది విజయోత్సవ సభ జరిగింది. ఎంఎల్‌ఎ కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తల్లికి వందనం నేటి నుండి అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈ పథకం ద్వారా 67,27,164 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లు నగదును ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. అలాగే ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు, ఆపై అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు నగదు జమ, పేదలకు ఇంటి పట్టాలు, ఇల్లు నిర్మాణం చేయనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ డి.ఇళంగోవవన్‌రెడ్డి, గోవిందస్వామి, శ్రీనివాస్ యాదవ్, సెల్వం పాల్గొన్నారు.

- ఏర్పేడులో.. కూడలిలో కేక్ కట్ చేశారు. టిడిపి అధ్యక్షులు పేరం నాగరాజునాయుడు మాట్లాడుతూ మండలంలో రెండు కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డివారి గురవారెడ్డి, నైనారు పొన్నారావు, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఎంఎల్‌ఎ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి, తల్లి బృందమ్మ ఆధ్వర్యంలో ఏడాది పాలన సంబరాలు జరిగాయి. మాజీ ఎంఎల్‌ఎ ఎస్సీవీ నాయుడు ఆధ్వర్యంలోనూ సంబరాలు జరిగాయి. చంద్రబాబును చూసి జగన్ బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు.


గూడూరులో..

సత్యవేడులో టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. మాజీ మండల అధ్యక్షులు పరమశివం, బాష ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

- బుచ్చినాయుడు కండ్రిగలో.. మండల అధ్యక్షులు ఎం.సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు పాల్గొన్నారు.

- పుత్తూరు టౌన్‌లో... పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ధనపాల్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కేక్ కట్‌చేసి విజయోత్సవాలు జరుపుకున్నారు.

- నాయుడుపేటలో.. రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ ఎంపి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం అన్నారు. భారీ కేక్ కట్ చేసి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

- రేణిగుంటలో.. పట్టణ అధ్యక్షులు మహబూబ్‌బాష, మండల అధ్యక్షులు మునిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.


తిరుమలలో...


శ్రీకాళహస్తిలో...


నాయుడుపేటలో..



శేఖర్‌పై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - పిచ్చాటూరు

బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఎన్.శేఖర్ (55)పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సిఐ రవీంద్ర తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ నిందితుడు శివలింగం కుమారుడు శేఖర్ కారూరు దళితవాడు వాసి. 15 సంవత్సరాల బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేయడమే కాకుండా, ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. బాలిక తల్లికి చెప్పడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ముద్దాయికి చనిపోయే వరకూ జైలుశిక్ష పడే అవకాశం ఉందని, మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడరాదన్నారు.

పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం

ఈ ఏడాది 3వేల ఎకరాల్లో లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర చిన్న సన్నకారు రైతులకు ఐదు ఎకరాల లోపు ఉన్న వారికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి 3వేల ఎకరాల్లో 18 రకాల పండ్లతోటలు, రెండు రకాల పూలతోటలు పండించేందుకు జిల్లా నీటిపారుదల శాఖ నిర్ణయం తీసుకుంది. మామిడి, జీడిమామిడి, నిమ్మ, తైవాన్‌జామ, జామ, సపోట, కొబ్బరి, అల్లనేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ,డ్రాగన్, మునగ, మల్లి, గులాబి, పనస, అంజూర ఉద్యానవన పంటలు పండించేందుకు ఉచితంగా మొక్కలను అందించనుంది. గత ఏడాది జిల్లాలో 1211 ఎకరాల్లో వర్షాధారిత ఉద్యానవన పంటలు చేపట్టింది. ఈ ఏడాది మూడువేల ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. జాబ్‌కార్డు ఉన్న అందరూ అర్హులుగా ఉద్యానవన శాఖ అధికారి పేర్కొన్నారు. మండల అధికారులు సంబంధిత ఎంపిడిఒలను, ఉపాధి ఎపిఒలను సంప్రదించాలని సూచించారు.

అహ్మదాబాద్ విమాన మృతులకు సిఐటియు సంతాపం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరం నుంచి లండన్ వెళ్లాల్సిన బోయింగ్ విమానం ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ప్రయాణికులు, విమాన సిబ్బంది, మెడికోల మృతికి సిఐటియు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, విమాన సర్వీసుల నిర్వహణ లోపాల కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా వెలువడిన వార్తలను బట్టి తెలుస్తుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పేర్కొన్నారు.

'అన్న' క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం అందించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



అన్నా క్యాంటీన్లలో నిర్దిష్టమైన సమయంలో నాణ్యమైన ఆహారం ప్రజలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య నిర్వాహకులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలోని ఎమ్మార్ పల్లి లోని అన్నా క్యాంటీన్, రవీంద్ర నగర్, కేశవాయనగుంట, ఎమ్మార్ పల్లి టిటిడి ప్లాట్స్ వద్ద ప్రజల నుండి వచ్చిన సమస్యలను, జరుగుతున్న అభివద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్లలో ఒక నిర్దిష్ట సమయంలో ఆహార పదార్థాలను అందించాలని అన్నారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

విజయాలకు కేరాఫ్ 'విద్యాజ్యోతి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న 'శ్రీ విద్యాజ్యోతి' ఇంగ్లీష్ మీడియం స్కూల్ విజయాలకు కేరాఫ్ గా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తూ అప్రహిత విజయాలను సాధిస్తోంది. బేబీ క్లాస్, ప్రాథమిక విద్యా స్థాయిలోనే విద్యార్థులకు అందిస్తున్న సజనాత్మకతతో కూడిన నాణ్యమైన విద్య ద్వారానే ఈ విజయాలు సాధ్యపడుతున్నట్లు కరస్పాండెంట్ సి. సంయుక్త రెడ్డి, ప్రిన్సిపాల్ సి. ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సైతం విద్యా జ్యోతి స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు. 500 మార్కులు, అంతకుమించి మార్కులు సాధించిన విద్యార్థులు వందమందికి పైగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పాఠశాలకు చెందిన ప్రీతం 583 మార్కులు, మనోజ్ 580, గీతిక 578, భావన 578 మార్కులు సాధించి పాఠశాల, పట్టణ స్థాయిలో టాపర్లుగా నిలిచారు. బేబీ క్లాస్ నుంచి పదో తరగతి వరకు ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయనీ, వివరాలకు సెల్ : 9966391914 నంబరును సంప్రదించాలని కోరారు. ఫైర్ సేఫ్టీ తో కూడిన విశాలవంతమైన భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామని యాజమాన్యం తెలిపింది. హాస్టల్, బస్సు సౌకర్యం కలదని తెలియజేశారు. 'కలలు కనడం తల్లిదండ్రుల బాధ్యత అయితే.. వాటిని నెరవేర్చడం విద్యాజ్యోతి బాధ్యతని కరస్పాండెంట్ సంయుక్త రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

విద్యార్థి మిత్ర పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో భాగంగా నూతన విద్యా సంవత్సరానికి గాను కొత్త పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీ, యూనిఫాం తదితర విద్యా సామాగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం యువశ్రీ మురళి, సురేష్‌బాబు, మురళి, లక్ష్మయ్య, జగన్నాథం, దాసు, మాధవీలత, సుజన తదితరులు పాల్గొన్నారు.

రావిళ్ల కృష్ణమనాయుడుకి నివాళి


నివాళి అర్పిస్తున్న పులివర్తి వినిల్

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండల పరిధిలోని కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన ఏపీఎస్‌ఆర్టీసీ విశ్రాంత డ్రైవర్, మండల తెలుగు యువత అధ్యక్షులు చేకూరి వెంకటేశ్వర ప్రసాద్ మామ రావిళ్ల కృష్ణమనాయుడు (ఆర్కే నాయుడు) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని తనయుడు టిడిపి యువ నాయకుడు పులివర్తి వినిల్, ఆర్కే నాయుడు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమ్మకండ్రిగ గ్రామంలో ఇటీవల మరణించిన కొడవకంటి సుబ్బమ్మ కర్మ క్రియలకు హాజరై ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, చేకూరి జనార్ధన్ చౌదరి, మధుసూదన్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, కే గిరిధర్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు


ప్రజాశక్తి-ఏర్పేడు: బాల కార్మిక వ్యవస్థను తల్లి దండ్రులు ప్రోత్సహిస్తే కుటుంబాలు ఎలా విచ్ఛిన్నమవుతాయో, ప్రగతి సంస్థ సభ్యులు గురువారం ఏర్పేడు మండల పరిధిలోని గ్రామాల ప్రజలకు వివరించారు. మునలిపేడు, కుక్కల గుంట, మెట్టిండ్లు గ్రామాలలో పిల్లలు, తల్లిదండ్రులతో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పాపా నాయుడుపేట క్లస్టర్ కోఆర్డినేటర్ సుభాష్ సమావేశం నిర్వహించారు. పాపా నాయుడుపేట జూనియర్ కళాశాల విద్యార్థులచే పని వద్దు- చదివే ముద్దు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సభ్యులు సుమలత, రాజేశ్వరి, అంగన్వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ అధికారిగా షణ్ముగం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల వ్యవసాయ అధికారిగా షణ్ముగం గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన ఏర్పేడు మండలంలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బుచ్చినాయుడు కండ్రిగ అగ్రికల్చర్ కార్యాలయంలో అగ్రికల్చర్ అధికారిగా పనిచేస్తున్న భారతి బదిలీపై నాగలాపురం మండలం వ్యవసాయ అధికారిగా వెళ్లారు.

బలిజలను బీసీల్లో చేర్చాలి


పాదయాత్ర చేస్తున్న ప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి -ఏర్పేడు: బలిజలను, తెలగ కాపులను బీసీల్లో చేర్చాలని, ఒంగోలుకు చెందిన ప్రసాద్ చిత్తూరు నుండి అమరావతికి పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర గురువారం మధ్యాహ్నం ఏర్పేడుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా బలిజ యువత నాయకులు, బిటిజిపి అధ్యక్షులు నైనారు బాలాజీ రావు ఆధ్వర్యంలో ప్రసాద్‌కు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మంచి పర్యావరణం ఆరోగ్యానికి తొలిమెట్టు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం వేపగుంట గ్రామ స్మశానంలో డాక్టర్ విజయ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు, డాక్టర్ ఎ. భాగ్యరాజ్, మాట్లాడుతూ ప్రకృతిని రక్షించడంలో సమాజం చురుకైన పాత్ర పోషించాలని ఇటువంటి ప్రయత్నాలు డాక్టర్ విజయ్కర్ సంస్థ ద్వారా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, దీపక్, భరత్, తిల్లు, విష్ణు, వెంకట్, సంతోష్‌లు పాల్గొన్నారు.

అంగన్వాడీ పిలుస్తోంది



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మన అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా 9 నుంచి 12 తేదీ వరకు వివిధ కార్యక్రమాలు అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్‌కి జాయిన్ అయ్యేవిధంగా చేయడమని అంగన్వాడీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో భాగంగా గురువారం మండలంలోని వివిధ అంగన్వాడీ సెంటర్లలో అక్షరాభ్యాసం, ర్యాలీ నిర్వహించి చిన్నారులను అంగన్వాడీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు గీతాంజలి సంధ్య, అనిత, శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



ప్రజాశక్తి - తిరుమల : నాయుడుపేటకు చెందిన పోతిరెడ్డి లోకేష్ అనే భక్తుడు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు గురువారం రూ.10 లక్షల విరాళాన్ని అందించారు. దాత తరపున ఆయన ప్రతినిధి శ్రీ రాఘవేంద్ర తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి కదిరి శాసన సభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ చేతుల మీదుగా విరాళం డీడీని అందజేశారు.

ఫీజుల మోత.. వసతులు రోత



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని, పుస్తకాల పేర్లతో వేల రూపాయల వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల మీద చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండెల నాసర్ జీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతిలు మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఐపీఎల్, ఎంపిఎల్ అంటూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఫీజులు లక్షల్లో తీసుకుంటూ వసతులు మాత్రం నామమాత్రంగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, జిల్లా ఆఫీస్ బేరర్స్ చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి

ప్రజాశక్తి - రామచంద్రపురం: తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలని మండల విద్యాశాఖాధికారి మార్కండేయ నాయుడు కోరారు. గురువారం మండలంలోని మిట్టూరు, చేకూరు, నాగమనాయుడు ఎర్రమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పాఠశాల రీఓపెనింగ్ రోజునే విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఎంఈఓ మార్కొండయ్య నాయుడు, గ్రామ సర్పంచ్ వేణుగోపాల్, పాఠశాల కమిటీ చైర్మన్ చిట్టిబాబు, ఎస్ఎల్‌టిఏ జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వర్, వెంకటరామయ్య, దిలీప్ కుమార్, కృష్ణార్జున రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు బాధ్యతల స్వీకరణ


మొదటి రోజే మొక్క నాటిన ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ

ప్రజాశక్తి-నాగలాపురం: నాగలాపురం మండలం టి.పి కోట మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వెంకటరమణ కుప్పం మండలం టి.సదుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వచ్చి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం పాఠశాల ఆవరణలో నేరేడు మొక్కలు నాటి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ పాఠశాల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షబానా బేగం, ఉపాధ్యాయులు జనార్ధన్, జయశంకర్, స్టెల్లామేరీ, అంగన్వాడీ టీచర్ రహమత్, స్థానికులు షాజహాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. గురువారం తిరుమల కుప్పంలో సబ్సిడీపై జనుము, పచ్చి రొట్ట ఎరువు, జిలగ విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, జడ్.బి.ఎన్.ఎఫ్, లత, విస్తరణ అధికారులు మురళి, సెల్వం, తరుణ్ కుమార్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బాలాజీ, కరుణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మే స్ఫూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదల ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మ స్ఫూర్తిగా శ్రీకాళహస్తిలో జనసేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కోటా వినుత తెలిపారు. స్థానిక పెండ్లి మండపం వద్ద గురువారం జనసేన ఆధ్వర్యంలో 47వ వారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కావలి శివకుమార్, తోట గణేష్, రిటైర్డ్ యం.ఆర్.ఓ చంద్ర శేఖర్ రావు, రవి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రాజధానిలో బొజ్జల బిజీబిజీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాజధాని అమరావతిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గురువారం బిజీబిజీగా గడిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మాస్టర్ ప్లాన్, నిత్యాన్నదానం పథకం విస్తరణ, గుడిమల్లం పరుశురామేశ్వరాలయం అభివద్ధిపై ముందుగా దేవాదాయ శాఖ కమిషనర్ ను కలిశారు. అనంతరం ఎస్-ఎస్ కెనాల్, బాలాజీ రిజర్వాయర్ పూర్తి పై రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడును కలిశారు. టిడిపి నేత రంగినేని చెంచయ్యానాయుడు పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌లో బీటీరోడ్డు పనులు వేగవంతం

ప్రజాశక్తి - తిరుమల : తిరుమలకు రాకపోకలు సాగించే కనుమదారుల్లో బీటీ రోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. వాహనదారులు మరింత అప్రమత్తంగా వాహనాలను నడపాలని టిటిడి భక్తులకు విజ్ఞప్తి చేస్తోంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఘాట్‌రోడ్డును మూసివేయకుండా నిర్దేశించిన సమయంలో మరమ్మతు పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. భక్తులు తిరుమల ప్రయాణాన్ని ప్రణాళికాబద్ధంగా మార్చుకుని కనీసం గంట సమయం ముందుగా ప్రారంభించాలని టిటిడి కోరుతోంది. అత్యవసర సేవలకు టిటిడి టోల్ ఫ్రీ నెంబర్ 155257 కు సంప్రదించాల్సి ఉంది.

తిరుపతి అభివృద్ధిలో ఎమ్మెల్యే ఆరణి తనదైన ముద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్కాట్ కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో తిరుపతి నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనదైన ముద్ర వేసుకున్నారని జనసేన నేత ఆర్కాట్ కష్ణప్రసాద్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనాన్ని పునరుద్ధరించడం, అత్యధిక జనాభా కలిగిన జీవకోన ప్రాంతంలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, తిరుపతి నియోజకవర్గ పరిధిలో లా అండ్ ఆర్డర్ అదుపులో ఉండడానికి అవుట్ పోస్టుల ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆరణి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. విలేకరుల సమావేశంలో బెల్లంకొండ సురేష్, ఆల్వార్ మురళి, సురేష్, జయంతి పాల్గొన్నారు.

దొంగ స్వామి సురేంద్రబాబు నుండి రక్షించండి: నాగిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్నో ఏళ్లుగా పిత్రార్జితంగా సంక్రమిస్తున్న భూమిని తమ తోడబుట్టిన తమ్ముడితో సన్నిహితంగా మెలుగుతూ భూమి కౌలుకు కావాలని అడిగి, అటు తరువాత ఆ భూమిలో వారాహి అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి నేడు ఆ భూమినే దౌర్జన్యంగా కబ్జా చేయాలని దొంగ స్వామి సురేంద్రబాబు యత్నిస్తున్నాడని, జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి అతని భారీ నుండి తమను కాపాడి భూమిని స్వాధీన పరచాలని తిరుచానూరు గ్రామానికి చెందిన యాగన్నగారి గంగిరెడ్డి కుమారుడు వై.నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. 1966లో తన తండ్రి గంగిరెడ్డిపై పైమాసి సంఖ్య 464లో 16 ఎకరాలకు సంబంధించిన భూమి రిజిస్టర్డ్ అయ్యిందని, దీనికి సంబంధించి 1980లో రైతు వారి పట్టాను కూడా పొందామన్నారు. అప్పటినుండి తమ తోబుట్టువులు అందరూ కలిసి సదరు భూమిలో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. రెండు సంవత్సరాల క్రితం కొండ సురేంద్రబాబు అనే దొంగ స్వామి వ్యవసాయం అంటే తనకు మక్కువని నమ్మబలికి తమ వద్ద నుండి 15 నుంచి 20 సెంట్లు భూమిలో చిన్నపాటి వ్యవసాయం చేసుకుంటానంటే అందరం సమ్మతించామన్నారు. అయితే అతను వ్యవసాయం చేయకుండా ఆ భూమిలో పూరి పాకను నిర్మించి అందులో వారాహి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తూ తన భూమి అంటూ అప్పటినుండి తమపై ఎదురు తిరిగి దాడులకు ప్రయత్నం చేయడమే కాకుండా చంపుతానని బెదిరిస్తున్నాడని వాపోయారు. విలేకరుల సమావేశంలో వై.రమేష్ రెడ్డి, వై.హేమాద్రి, వై.మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి: కేశవులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి గ్రామీణ మండలం పేరూరు గ్రామపంచాయతీ గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 529/4ఏ లో ఉన్న 98 సెంట్లు ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడి ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేయాలని సర్పంచి దామినేటి కేశవులు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ గ్రామానికి చెందిన కొంతమంది ఈ స్థలాన్ని గతంలో రిజిస్ట్రేషన్ అయ్యాయని డాక్యుమెంట్లు చూపుతూ రాత్రికి రాత్రి నేలను చదును చేసి కబ్జాకు ప్రయత్నం చేయడంతో గ్రామస్తులంతా అడ్డుకున్నామన్నారు. దీన్ని వక్రీకరిస్తూ పత్రికల్లో వైసీపీ నాయకులు భూ కబ్జాకు పాల్పడుతున్నారని అసత్య ప్రచారాలు చేశారన్నారు. తప్పుడు ప్రచారం మళ్ళీ చేస్తే పరువు నష్టం దావా వేస్తామని వైసీపీ నాయకులు చెంచు మోహన్ యాదవ్ హెచ్చరించారు.

వర్షాధార పంటలకు డ్వామా సహకారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతరుల చిన్న, సన్నకారు రైతులకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ద్వారా 5 ఎకరాల లోపు వ్యక్తిగత వ్యవసాయ భూముల్లో వర్షాధార పంటల తోటల పెంపకం చేయడానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక ప్రోత్సాహకం ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ హోదాలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. వర్షాధార పంటలు మామిడి, జీడి మామిడి, నిమ్మ, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి, దానిమ్మ ఇలా 18 రకాల పండ్ల తోటలు, రెండు రకాల పూల తోటల సాగు, మునగ పంటతో కలిసి 21 రకాల మొక్కల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సాగు నిర్వహణకు ఉపాధి హామీ నిధులతో సహకారాన్ని అందిస్తున్నామన్నారు. గుంతలు తవ్వటం, మొక్కల కొనుగోలు, మొక్కలు నాటుట, మొక్కలకు నీరు పోయుట వంటి నిర్వహణ ఖర్చులకు పంట రకాలను బట్టి 100 శాతం ఉచితంగా 2 నుంచి 3 సంవత్సరాల వరకు ఎకరానికి సుమారు రూ.68,103/- నుండి రూ.2,51,226/- రైతులకు చెల్లించడం జరుగుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2024-25 లో తిరుపతి జిల్లా పరిధిలో 1211 ఎకరాలలో వివిధ వర్షాధారిత ఉద్యాన పంటల పెంపకం చేపట్టడం జరిగిందని, ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో 3 ఎకరాలలో ఉద్యాన పంటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. అన్ని వర్గాలు చిన్న, సన్న కారు రైతులు దరఖాస్తులను సంబంధిత మండల కార్యాలయం అధికారి, ఎంపీడీవోలు, డ్వామా అదనపు కార్యక్రమాధికారి, ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి సంబంధిత పత్రాలను సమర్పించాలన్నారు.

జిల్లా పరిధిలో 279 మంది కార్యదర్శుల బదిలీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సాధారణ బదిలీల జీవోలో భాగంగా 279 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీలు చేశామని జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి తెలిపారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహించామని అన్నారు.

సత్యవేడులో వైభవంగా గంగమ్మ జాతర



ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడులో రెండు రోజులు పాటు కొనసాగుతున్న గంగజాతర గురువారం రాత్రితో ముగియనుంది. పట్టణంలో బుధవారం రాత్రి ప్రారంభమైన గంగమ్మ ఊరేగింపు రాత్రంతా పురవీధుల్లో అమ్మవారి దర్శన భాగ్యం కలిగిస్తూ గురువారం ఉదయం గాంధీ రోడ్డు గంగమిట్ట వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిల్లో అమ్మవారు కొలువ తీరారు. వేపసరాలు తొడుక్కుని పలువురు భక్తులు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక సిఐ మురళినాయుడు, ఎస్ఐ రామస్వామి అమ్మవారు కొలువుతీరిన గంగ మిట్ట వద్ద దగ్గరుండి పర్యవేక్షించడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గంగమ్మను దర్శించుకున్నారు. గంగ జాతరను పురస్కరించుకొని ముదిరాజ్ సేవా సంఘం మండల అధ్యక్షులు మురళి(చికెన్ చిన్న) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. సాంప్రదాయానికి ప్రతిగా నిలిచే గంగ జాతర సందర్భంగా పలువురు భక్తులు విభిన్న వేషధారణల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంది. టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు అందజేశారు. శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి గంగమ్మను దర్శించుకున్నారు.

గజ వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

ప్రజాశక్తి - పుత్తూరు : అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 07.00 గం.లకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారు గజ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం 08.00 గం.లకు సూర్యప్రభ వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తులను అనుగ్రహించనున్నారు. వాహన సేవలో టిటిడి డిప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, ఏఈవో శ్రీ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు,భక్తులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్నిస్ విజేతగా ఎంజిఎం విద్యార్థి



రోహిత్‌కు అభినందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఓపెన్ టెన్నిస్ అండర్-14 విభాగంలో స్థానిక ఎంజిఎం స్కూల్లో పదవ తరగతి చదువుతున్న గురు రోహిత్ విజేతగా నిలిచాడు. చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాలకు సంబంధించి జరిగిన ఓపెన్ టెన్నిస్ పోటీల్లో సింగిల్స్ విభాగంలో పోటీపడ్డ రోహిత్ విజేతగా నిలవగా, డబుల్స్‌లో రన్నర్‌గా నిలిచాడు. గురువారం ఓపెన్ టెన్నిస్‌లో సత్తా చాటిన రోహిత్‌ను ఎంజీఎం గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. చదువుతోపాటు క్రీడలకు సైతం ఎంజీఎం ప్రాధాన్యత నిస్తుందని మయూర్ తెలిపారు.

గంగ జాతరలో రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వేపగుంటలో జరిగిన గంగమ్మ జాతరలో మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. గంగమ్మకు సారె సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆమె వెంట ఎంపీపీ మునివేలమ్మ, మున్సిపల్ చైర్మన్ ఏ హరి, వైసీపీ నాయకులు ఉన్నారు.

క్రైం న్యూస్

అక్రమ బియ్యం రవాణా అడ్డుకున్న సీఐ బాబి




ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటలో జోరుగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాను గురువారం సీఐ బాబీ అడ్డుకున్నారు. పాత శివాలయం వీధిలో కంప రమేష్ అనే వ్యక్తి గురువారం 50 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా, చుట్టుపక్కల వారి సమాచారం మేరకు నాయుడుపేట ఎస్సై ఆదిలక్ష్మి, సీఐ బాబీ సిబ్బందితో వెళ్లి రమేష్‌ను వాహనంతో సహా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, పూడి గ్రామం వద్ద గురువారం ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పెన్నలపాడు స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌ను అతివేగంగా నడపడంతో పంట పొలాల్లో బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను మితిమీరిన వేగంతో నడపటం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, మద్రిగుంట వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివారల్లోకి వెళితే హైదరాబాదుకు చెందిన చందు (20), వరంగల్‌కు చెందిన శివకుమార్ (23) ఇరువురు ఆరవ తేదీ తిరుమల శ్రీవారి దర్శనార్థకం హైదరాబాదు నుండి ద్విచక్ర వాహనంలో బయలుదేరి 7వ తేదీ తిరుమల చేరుకున్నారు. దర్శనానంతరం గురువారం ఉదయం తిరిగి హైదరాబాదుకు బయలు దేరారు. రేణిగుంట మండలం, మద్రిగుంట వద్ద నూతనంగా నిర్మించిన హైవే రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద ఉదయం 3 గంటలకు గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఘటనా స్థలంలో చందు అక్కడికక్కడే మృతిచెందగా, శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడినిని దగ్గరలో ఉన్న బాలాజీ హాస్పిటల్‌కు తరలిచారు. సమాచారం తెలుసుకున్న శివకుమార్ తనయులు మెరుగైన వైద్యం కోసం బాలాజీ హాస్పిటల్ నుండి హైదరాబాద్‌కు తీసుకువెళ్లగా అక్కడ వైద్యం పొందుతూ శివకుమార్ కూడా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రేణిగుంట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ బస్టాండ్ ఆవరణలో గురువారం సాయంత్రం సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాధ్ నాయుడు సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. వాహనదారుల లైసెన్సులు తనిఖీ చేశారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగ పవన్ పేర్కొన్నారు. గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులో గురు వారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేస్తున్న బాలలకు విముక్తి కల్పించాలన్నారు. బాల కార్మిక చట్టాలను ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జడ్జి రాజేష్, న్యాయవాదులు కోటేశ్వర రావు, హరి ప్రసాద్, రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా నిర్వహిస్తున్న ఉచిత స్క్రీనింగ్ కార్యక్రమాల ద్వారా అవగాహన పెంచుకుని క్యాన్సర్‌ను జయించాలని వైద్యాధికారి డాక్టర్ జ్యోతి కోరారు. గురువారం చెన్నూరు పీహెచ్సీ పరిధిలోని రామలింగాపురం, చెన్నూరు-3 గ్రామాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ను నిర్వహించారు. కేన్సర్ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మనోహర, టీడీపీ చిన్నగొట్టిగల్లు క్లస్టర్ ఇంచార్జ్ కొట్టే శివకుమార్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మాజీ అధ్యక్షులు ఎర్రయ్య నాయుడు, డాక్టర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.